ఆంధ్రజ్యోతి



5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 15 ఏప్రిల్ 2025

కుల మురికిని కడిగేద్దాం

అంబేడ్కర్ 134వ జయంతి సభలో ముఖ్యమంత్రి స్టాలిన్

1000 గృహాలు ప్రారంభం ● లబ్ధిదారులకు తాళాలు అందజేత



లబ్ధిదారులకు గృహాల తాళాలను అందజేస్తున్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని చీడపురుగులా తొలచివేస్తున్న కులం అనే వెయ్యేళ్ల మురికిని తుడిచిపెట్టడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. స్థానిక చేపాక్‌లోని కలైవానర్ అరంగంలో సోమవారం ఉదయం రాష్ట్రప్రభుత్వం తరఫున భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ గిరిజన కుటుంబాల కోసం ప్రభుత్వం తరఫున నిర్మించిన 1000 గృహ సముదాయాలను ప్రారంభించి 49,548 మంది లబ్ధిదారులకు పలు సంక్షేమ పథకాల సహాయాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం సభను ఉద్దేశించి మాట్లాడుతూ... భారత రత్న అంబేడ్కర్ జయంతిని సమైక్య దినంగా రాష్ట్రప్రభుత్వం తరఫున జరుపుకోవాల్సిందిగా ప్రకటించామని తెలిపారు. స్థానిక రాజా అన్నామలైపురంలో ఉన్న అంబేడ్కర్ మణిమంటపానికి వెళ్ళి సమైక్యదినంగా ప్రతిజ్ఞ చేసిన తర్వాతే తాను ఈ వేడుకల్లో పాల్గొన్నానని, కుల వివక్షను రూపుమాపి, సమైక్య వైపుకు తమ సమాజం ముందుకెళ్ళాలని సూచించారు. విప్లవ నాయకుడు అంబేడ్కర్ రచించిన కుల నిర్మూలనకు అనుసరించాల్సిన మార్గం అనే పుస్తకాన్ని గత 1930వ సంవత్సరమే ద్రావిడ పితామహుడు పెరియార్ తమిళంలో ఆవిష్కరించి అంబేడ్కర్‌కు మరింత ఘనత చేకూర్చారని కొనియాడారు.

సభకు మరింత గౌరవం...

సామాజిక న్యాయం, సమైక్యత, దళిత వర్గాల హక్కుల కోసం అలుపెరుగక ఉద్యమాల్లో పాల్గొంటున్న అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం సభకు మరింత గౌరవం చేకూరిందన్నారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వంలో నేడు లెక్కలేనన్ని విజయాలను సాధించగలుగుతున్నానని, అందువల్లే తాను నగరంలోవున్న పలు విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్యను ప్రతి విద్యాసంవత్సరం పెంచుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ విద్యార్థులకు ఆశ్రయం కల్పించేలా సైదాపేటలో ఎంసీ రాజా విడిది గృహానికి మరిన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న సంకల్పంతో ప్రభుత్వం తరుపున నాలుగేళ్లలో 6,977 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏటా జనవరిలో జరుపుకునే తిరువళ్లువర్ దినోత్సవం రోజున డాక్టర్ అంబేడ్కర్ అవార్డును కూడా అందిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల పథకంలో 3,950 మందికి రూ.630 కోట్ల రుణసాయం పంపిణీ చేసినట్లు సీఎం సభకు వివరించారు. అంబేడ్కర్ విదేశీ విద్యా ఆర్థికసాయం పథకం కింద వివిధ దేశాల్లో పీహెచ్‌డీ, రీసెర్చి కోర్సులు చదువుకుంటున్న 174 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషం కలిగించిందన్నారు. బడుగు బలహీనవర్గాల కుటుంబాలలోని పిల్లలకు విద్యా, ఉద్యోగావకాశాలు, ఉన్నత సదవుల్లో అలంకరింపజేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పలు పథకాలను ప్రవేశపెడుతోందని పేర్కొన్న సీఎం స్టాలిన్ చివరగా జైభీమ్ అని చెప్పి, తన ప్రసంగాన్ని ముగించారు.

పరువు హత్యలు అడ్డుకునే చట్టం రావాలి

రాష్ట్రంలో పరువు హత్యలను అడ్డుకునేలా చట్టం ప్రవేశపెట్టాలని, ఇందుక తమిళనాడు ముందుకొస్తే దాన్ని మిగిలిన రాష్ట్రాలు కూడా అనుసరిస్తాయని బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రకాశ్ అంబేడ్కర్ మాట్లాడుతూ... కులాంతర వివాహాలకు దేశవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతోందన్నారు. సమాజానికి కనువిప్పు కలిగించిన అంబేడ్కర్ జయంతిని సమైక్యత దినంగా ప్రకటించిన స్టాలిన్... రాష్ట్రప్రభుత్వం ఈ చట్టాన్ని వెంటనే రూపొందించి పలు నిండుప్రాణాలను కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఎంపీ స్వామినాథన్, ఎం.సుబ్రమణ్యం, పీకే.శేఖర్ బాబు, కోవి చెలియన్, కైయళవిళి సెల్వరాజ్, అన్బిల్ మహేష్, డీపీఐ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్, డీఎంకే ఎంపీ ఏ.రాజా, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

పెరగనున్న భగభగలు


● పది జిల్లాల్లో తేలికపాటి వర్షాలు



పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇకపై పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. అయితే 10 జిల్లాల్లో మాత్రం ఒకట్రెండు చోట్ల ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతోంది. ఈ కారణంగా, నీలగిరి, కోవై, తిరుప్పూర్, తేని, దిండుగల్, తెన్‌కాశి, విరుదునగర్, తిరునల్వేలి, కన్నియాకుమారి, తూత్తుకుడి తదితర జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఈనెల 19వ తేది వరకు ఉరుములతో కూడిన తేలికపాటి వర్షం కురవనుంది. అదే సమయంలో, రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 4 డిగ్రీల సెల్సియస్ వరకు పెరగనున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గడంతో ఉక్కపోతగా ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా గత నెల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. చెన్నై, వేలూరు, కరూర్ సహా పలు జిల్లాల్లో 39 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు పెరుగనున్న దృష్ట్యా పిల్లలు, వృద్ధులు సాధ్యమైనంత వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావద్దని, అత్యవసర పనులను తగిన జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలో బీజేపీ కాలు పెట్టలేదు

● సెల్వపెరుందగై



రాయపేటలో టీఎన్‌సీసీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సెల్వపెరుందగై, తంగబాలు తదితరులు

అడయార్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎంతటి బలమైన కూటమితో ఎన్నికల్లో పోటీ చేసినా రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అడుగు పెట్టలేదని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై అన్నారు. రాయపేటలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన సత్యమూర్తి భవన్‌లో అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ ప్రజల కోసం అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగానికి కేంద్రంలోని బీజేపీ పాలకులతో ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజ్యాంగాన్ని, చట్టాలను పరిరక్షించేందుకు కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఉత్పన్నమైందన్నారు. భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేసి ఆర్‌ఎస్‌ఎస్ చట్టాన్ని అమలు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రణాళిక రచించారని దీన్ని ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించబోమన్నారు. అలాగే, బీజేపీ ఉండే కూటమికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన చెప్పారు.

ఎన్డీఏ కూటమిలోనే ఓపీఎస్, దినకరన్?

● పన్నీర్ వర్గానికి నాలుగు సీట్లు!

● దినకరన్‌కు నాలుగు!

● ఆ మేరకు ఇప్పటికే ఒప్పందం

● ఎన్నికల నాటికి ప్రకటన



చెన్నై, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్), 'అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం' అధినేత టీటీవీ దినకరన్‌కు ఎన్డీఏ కూటమిలోనే చోటు ఖరారైందా?.. వారిని అన్నాడీఎంకేలోకి చేర్చుకునేందుకు విముఖత చూపిన ఆ పార్టీ అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్).. ఎన్డీఏ కూటమిలోకి చేర్చుకునేందుకు మాత్రం సుముఖత తెలిపారా?.. అవుననే అంటున్నాయి అత్యంత విశ్వసనీయ వర్గాలు. ఇటీవల బీజేపీ అగ్రనేత అమిత్‌షా, ఈపీఎస్ మధ్య జరిగిన ఒప్పందం అనుకున్నది అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నేతలంతా ఒకే కూటమి కింద పని చేయడం ఖాయమైపోయింది. ఇటీవల చెన్నై వచ్చిన అమిత్‌షా.. అన్నాడీఎంకేతో పొత్తు ఖరారు చేసి వెళ్లిన విషయం తెలిసిందే. అంతేగాక రాష్ట్రంలో అన్నాడీఎంకే నేతృత్వంలోనే తమ కూటమి పని చేస్తుందని కూడా ప్రకటించారు. నిజానికి ఈ ప్రకటన వెలువడడానికి ముందు ఈ రెండు పార్టీల మధ్య తీవ్రమైన కసరత్తు జరిగినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఒంటరి పోరు సరిపోక...

జయ మరణానంతరం జరిగిన పరిణామాల్లో అన్నాడీఎంకే నుంచి ఓపీఎస్‌ను శశికళ బహిష్కరించగా, ఆమెను ఈపీఎస్ వెళ్లగొట్టిన విషయం తెలిసిందే. అనంతరం ఈపీఎస్ బీజేపీకి చేరువయ్యారు. అయితే శశికళ జైలు నుంచి విడుదలై వచ్చాక అన్నాడీఎంకే కార్యకర్తలు, నేతల నుంచి ఎదురైన స్పందనను గ్రహించిన బీజేపీ అగ్రనేతలు.. ఆమెను, ఓపీఎస్, దినకరన్‌ను కూడా పార్టీలోకి చేర్చుకోవాలని ఈపీఎస్‌పై ఒత్తిడి తెచ్చారు. ఇందుకు ససేమిరా అన్న ఈపీఎస్.. ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని, కానీ ఈ విషయంలో ఎదురయ్యే ఒత్తిళ్లకు మాత్రం తలొగ్గేది లేదని తేల్చిచెప్పారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డీఎంకేను ఎదుర్కొవాలంటే తమ ఒంటరి పోరు సరిపోదని గ్రహించిన బీజేపీ - అన్నాడీఎంకే మళ్లీ పాత కూటమిని పునరుద్ధరించేందుకు అడుగులు వేశాయి. ఇందులో భాగంగా ఢిల్లీ వెళ్లిన ఈపీఎస్.. అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు తమ ఆలోచనలు, అభ్యంతరాలను పరస్పరం పంచుకున్నట్లు సమాచారం.

అన్నామలైను తొలగించాల్సిందే...

అన్నాడీఎంకే అధినేత్రి జయ పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అన్నామలైను తొలగించాలని ఈపీఎస్ స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. జయను విమర్శించిన అన్నామలైతో వేదిక పంచుకుంటే తమ కార్యకర్తలు పని చేయలేరని పేర్కొన్నారు. ఇందుకు అమిత్‌షా అంగీకరించారు. అదే సమయంలో ఓపీఎస్, దినకరన్‌ను పార్టీలో చేర్చుకోవాలన్న మిత్రపక్ష అభ్యర్థనకు విముఖత చూపిన ఈపీఎస్.. వారిని ఎన్డీఏ కూటమిలో చేర్చుకునేందుకు మాత్రం అంగీకరించారు. ఆ మేరకు ఓపీఎస్ సొంతంగా పార్టీ పెట్టుకోవడం, లేదా బీజేపీలో చేరడం చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఆయన వర్గానికి రెండు స్థానాలు, ఆయన సహచరుడిగా ఉన్న ఎమ్మెల్యే కేపీ వైద్యలింగం వర్గానికి రెండు స్థానాలు, దినకరన్ వర్గానికి నాలుగు స్థానాలు ఇచ్చేందుకు ఈపీఎస్ అంగీకరించినట్లు సమాచారం. అదే సమయంలో ఓపీఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి వీలు లేదని, ఆయన కుమారుడు పోటీ చేస్తే తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నట్లు తెలిసింది. ఇందుకు అమిత్‌షా అంగీకరించినట్లు సమాచారం. ఆ సమాచారాన్ని ఇప్పటికే ఓపీఎస్, దినకరన్‌లకు చేరవేయగా, వారు కూడా ఆ ప్రతిపాదనతో సంతృప్తి చెందినట్లు తెలుస్తోంది.

కూటమికి నాయకత్వం...

ఇక కేంద్రంలో తాము బీజేపీ నేతృత్వంలో పని చేస్తామని, కానీ రాష్ట్రంలో మాత్రం తామే కూటమికి నేతృత్వం వహిస్తామని, ఈ వ్యవహారంలో ఎలాంటి శషభిషలకు ఆస్కారం లేకుండా ముందుగానే బీజేపీ రాష్ట్ర నేతలకు తేల్చిచెప్పాలన్న ఈపీఎస్ డిమాండ్‌ను అమిత్‌షా అంగీకరించినట్లు సమాచారం. అందుకే ఆయన మీడియదా సమావేశంలోనూ రాష్ట్రంలో తమ కూటమికి అన్నాడీఎంకేనే నేతృత్వం వహిస్తుందని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులైనప్పటికీ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ కూటమి కిందనే ఓపీఎస్, దినకరన్‌ల వర్గాలకు పని చేసే అవకాశం లభించడం దాదాపు ఖరారైనట్లే కనిపిస్తోంది. తద్వారా ఓపీఎస్, శశికళ, దినకరన్ వర్గాలకు చెందిన ఓట్లు తమ కూటమి నుంచి దూరం కావని బీజేపీ-అన్నాడీఎంకే వర్గాలు కూడా భావిస్తున్నాయి.

బేరసారాల్లో ఈపీఎస్‌దే పైచేయి?

రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారుకు ముందు జరిగిన బేరసారాల్లో ఈపీఎస్‌దే పైచేయిగా ఉన్నట్లు అన్నాడీఎంకే వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. నిజానికి అన్నాడీఎంకేలో లుకలుకలు, వరుసగా వచ్చిపడుతున్న ఈడీ దాడులతో బేజారెత్తిపోయిన ఈపీఎస్.. పొత్తుకు తలూపక తప్పలేదని డీఎంకే వర్గాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కానీ కూటమికి నేతృత్వం వహించడం నుంచి వివిధ పార్టీల చేరిక వరకు ఈపీఎస్ చేసిన సూచనలకు అమిత్‌షా మారుమాట్లాడకుండా ఆమోదించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేస్తే డీఎంకేకు లాభం చేకూర్చడం మినహా, తమ పార్టీలకు ఒరిగేదేమీ ఉండదని గ్రహించిన అమిత్‌షా ఈపీఎస్ సూచనలకు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. అయితే భవిష్యత్తులో కేంద్రంలో తాము పూర్తిగా అండగా ఉంటామని, అందువల్ల రాష్ట్రంలో తమకు సహకరించాలని ఈపీఎస్ నచ్చచెప్పడం వల్లనే అమిత్‌షా ఆయన సూచనలకు తలూపారని బీజేపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

చెన్నైలో 446 కి.మీ. సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్టు

● కేంద్ర ఈఏసీ గ్రీన్ సిగ్నల్



వాషర్‌మెన్ పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో ప్రతిపాదిత సహజ వాయువు పైప్‌లైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నిపుణుల అంచనా కమిటీ (ఈఏసి) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు టొరెంటో గ్యాస్ చెన్నై ప్రైవేట్ లిమిటెడ్‌కు తీర ప్రాంత నియంత్రణ జోన్ క్లియరెన్స్‌ను కమిటీ మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా చెన్నై దాని పరిసర ప్రాంతాల్లో సహజ వాయువును సరఫరా చేయడానికి 466 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ పైప్‌లైన్ ద్వారా గృహాలకు సహజ వాయువును అందించనున్నారు. అదేవిధంగా, వాణిజ్య, పారిశ్రామిక, వాహన వినియోగదారులకు ఈ పైప్‌లైన్ ఉపయుక్తం కానుంది. వల్లూరు గ్రామం నుంచి మొదలయ్యే ఈ పైప్‌లైన్ వెట్టువాంకని, నీలాంగరై, తిరువాన్మియూరు, అడయారు, చేపాక్కం, ప్యారీస్ కార్నర్, రాయపురం, తండయార్‌పేట, తిరువొత్తియూరు, ఎన్నూరు, నెట్టుకుప్పం మీదుగు వెళ్లనుంది. మొత్తం పైప్‌లైన్ పొడవులో సుమారు 260 కి.మీ. సీఆర్‌జెడ్ తీర ప్రాంత నియంత్రణ జోన్ పరిధిలోనే ఉంది. దీంతో ఈ ప్రాజెక్టు కఠినమైన పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులో 12 నుంచి 18 అంగుళాల ప్రధాన స్టీల్ ట్రంక్ లైన్‌తో పాటు మీడియం డెన్సిటీ పాలీ ఎథిలిన్ (ఎండీపీఈ) పైప్‌లైన్ ఉంటాయి. ఇవి సురక్షితమైన కనెక్టివిటీని నిర్ధారిస్తాయి. టొరెంటో గ్యాస్ చెన్నై ప్రైవేట్ లిమిటెడ్ పంపించిన ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే అనుమతులు మంజూరు చేసినట్లు కమిటీ తెలిపింది. ఈ ప్రాజెక్టుకు తమిళనాడు రాష్ట్ర తీరప్రాంత మండల నిర్వహణ అథారిటీ సానుకూల స్పందనను కూడా పరిగణనలోకి తీసుకున్నట్లు కమిటీ వెల్లడించింది. పర్యావరణ పరిరక్షణ, భద్రతా విషయంలో ఏ మాత్రం రాజీ పడేది లేదని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది.

హిమాలయాలకు అన్నామలై

● బాబా గుహలో ధ్యానం



అడయార్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పదవీ కాలం ముగియడంతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్న కె.అన్నామలై ఆధ్యాత్మిక పర్యటన కోసం హిమాలయాలకు వెళ్లారు. అక్కడ బాబా గుహలో ఆయన ధ్యానం మొదలుపెట్టారు. రాష్ట్ర బీజేపీ చీఫ్‌గా నయినార్ నాగేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే అన్నామలై ఆదివారం ఆకస్మికంగా ఢిల్లీకి వెళ్లారు. అక్కడినుంచి ఆయన హిమాలయాలకు వెళ్లారు. తన ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా, ఆయన బాబా గుహలో ధ్యానం చేపట్టారు. ఈ గుహలోనే సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా పలుమార్లు ధ్యానం చేశారు. ఈ పర్యటన ముగించుకుని ఈ నెల 16న అన్నామలై రాష్ట్రానికి చేరుకోనున్నారు. కాగా, అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకున్న అన్నామలైకు బీజేపీ అధిష్ఠానం కీలక బాధ్యతలను అప్పగించనున్నదనే ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగాసాగుతోంది.

అరివాలయాన్ని తొలగిస్తామన్న అన్నామలై పదవినే పీకేశారు

● మంత్రి టీఎం అన్బరసన్

డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయ సెంగోల్ (రాజదండం)ను తొలగిస్తానన్న అన్నామలై అధ్యక్ష పదవినే పీకేశారని రాష్ట్ర మంత్రి టీఎం అన్బరసన్ ఎద్దేవా చేశారు. స్థానిక ఆదంబాక్కంలో సోమవారం జరిగిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, డీఎంకేను ఎవరు దెబ్బ తీయాలనుకున్నా వారు బాగుపడిన దాఖలాలు లేవన్నారు. తమ సిద్ధాంతాలు, విధి విధానాల్లో తాము స్పష్టంగా ఉన్నామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని పార్టీలు ఏకమైనా గెలుపు డీఎంకే కూటమిదేనని మంత్రి అన్బరసు వ్యాఖ్యానించారు.

సమాచార దర్శిని

టెట్ ఫలితాల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన సెకండరీ ఉపాధ్యాయుల పోస్టుల నియామక పరీక్షా ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) ఆధ్వర్యంలో 2,780 సెకండరీ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి గత ఏడాది జూలై 12న నిర్వహించిన ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)కు 25,176 మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు విడుదలైన నేపథ్యంలో, 1,112 మంది 100 మార్కులు, 2,798 మంది 90-99, 5,737 మంది 80-89, 7,665 మంది 70-79 మార్కులు పొందారు. అర్హత సాధించిన వారి సర్టిఫికెట్ల పరిశీలన తేదీలు త్వరలో వెల్లడిస్తామని టీఆర్బీ తెలిపింది.

షార్జాలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): షార్జా నగరంలో వివిధ టెక్నికల్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని విదేశీ ఉద్యోగ అవకాశాల సంస్థ ప్రకటనలో తెలిపింది. స్టీల్ స్ట్రక్చరల్ ఫ్యాబ్రికేటర్లు, సీఎన్సీ, లేజర్ కటింగ్ మెషీన్ ప్రోగ్రాం కం ఆపరేటర్, హెవీ బస్సు డ్రైవర్లు, మార్కెటింగ్ మరియు ప్రొడక్షన్ ఇంజనీర్లు వంటి వివిధ సాంకేతిక ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి కలిగిన వారు ovemclnm@gmail.comలో స్వీయ వివరాల దరఖాస్తు, విద్యార్హత, పని అనుభవం సర్టిఫికేట్లు, పాస్ పోర్టు నకళ్లు పంపించాలి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూ మే 3,4 తేదీల్లో స్థానిక గిండిలోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో జరుగనుంది. వివరాలకు www.omomanpower.tn.gov.inలో సంప్రదించవచ్చు.

కండలేరు డ్యాం నుంచి నీటి విడుదల పెంపు

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి కృష్ణా జలాల విడుదల పెంచారు. చెన్నైవాసుల తాగునీటి అవసరార్థం రాష్ట్ర ప్రజాపనుల శాఖ విజ్ఞప్తితో ఏపీ ప్రభుత్వం కండలేరు డ్యాం నుంచి గత నెల 24వ తేదీ నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తోంది. ఈ జలాలు 152 కి.మీ ప్రయాణించి రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఊత్తుకోట తామరైకుప్పం జీరో పాయింట్‌కు 28వ తేది చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, కండలేరు డ్యాం నుంచి అదనంగా 300 క్యూసెక్కులు అనంతరం క్రమక్రమంగా పెంచుతూ 1,340 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు.

డిపాజిట్లపై ప్రత్యేక వడ్డీ

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా అభివృద్ధి ఆర్థిక సంస్థ 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా, పెట్టుబడులపై ప్రత్యేక వడ్డీ రేట్లు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం 1975లో రాష్ట్ర రవాణా శాఖ ఆర్థిక లోటు అధికమించేలా ఈ సంస్థను ప్రారంభించింది. బ్యాంకు నిధి సంస్థాగతంగా నమోదు చేయబడి రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకత్వంలో ట్రిప్లికేన్ వద్ద కార్యాలయంగా పనిచేస్తున్న ఈ సంస్థ, ప్రజలు, సంస్థల నుంచి డిపాజిట్లు సేకరిస్తోంది. ప్రస్తుతం 1.37 లక్షల మంది వినియోగదారులతో రూ.10,427 కోట్లు పెట్టుబడితో సంస్థ పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో రూ.50 వేలు పెట్టుబడులపై ఒకటి నుంచి ఐదు సంవత్సరాల వరకు 8.10 శాతం నుంచి 8.50 శాతం వడ్డీ అందజేస్తోంది. ఆ ప్రకారం, పెట్టుబడి కాలం ముగిసిన వినియోగదారులు రూ.54,175 నుంచి రూ.76,140 వరకు పొందవచ్చు. అలాగే, 60 ఏళ్లు దాటిని వినియోగదారుల పెట్టుబడులపై 8.25 శాతం నుంచి రూ.9 శాతం వరకు అందజేయనుంది. మరిన్ని వివరాలకు www.tdfc. in అనే వెబ్‌సైట్‌లో కానీ, నెం.044-25333930లో సంప్రదించవచ్చు.

శిథిలావస్థకు చేరిన 14 నిర్మాణాల కూల్చివేత

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ మండల పరిధిలోని 168, 171, 172, 173, 174, 177, 178, 179 వార్డుల్లోని కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరుగుదొడ్లు, ఎరువు తయారీ కేంద్రం సహా 14 నిర్మాణాలను కూల్చివేయాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. 1977లో నిర్మించిన ఈ కట్టడాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒక్కో కట్టడం 600 నుంచి 40,000 చ.అ విస్తీర్ణం కలిగి ఉన్నాయి. ఈ కట్టడాలు కూల్చివేయనున్నట్లు, ఆయా స్థలాల్లో ప్రత్యామ్నాయ ప్రాజెక్టులకు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

1,080 ప్రైవేటు బస్సులు నడిపేందుకు టెండర్లు

పెరంబూర్; ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా 1,080 ప్రత్యేక బస్సులు నడిపేందుకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) టెండర్లు పిలిచింది. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో నగరాల నుంచి ప్రజలు స్వగ్రామాలకు వెళ్లేలా ఎస్ఈటీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వేసవి సెలవుల్లో అధికంగా ప్రజలు వినోద, విహారయాత్రలకు వెళ్లేందుకు అవకాశముండడంతో వారి అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలని నిర్ణయించింది.

మేట్టూరు డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మేట్టురు డ్యాంకు నీటి రాక స్వల్పంగా పెరిగింది. డ్యాం పరీవాహ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాంకు సెకనుకు 424 ఘనపుటడుగుల నీరు వస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 107.53 అడుగులు (74.945 టీఎంసీలు) ఉండగా, తాగునీటి అవసరాలకు 1,000 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

సాగునీటి విడుదల నిలిపివేత...

తేని జిల్లా ఆండిపట్టి సమీపంలోని వైగై డ్యాం నుంచి సాగు నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. 71 అడుగుల సామర్థ్యం కలిగిన ఈ డ్యాంలో ప్రస్తుతం 56.36 అడుగుల నీటి నిల్వలున్నాయి. కొద్దిరోజులుగా డ్యాం నుంచి సాగు, తాగు నీటి అవసరాలకు 522 ఘనపుటడుగులు విడుదల చేస్తున్న నేపథ్యంలో, సోమవారం నుంచి నీటి విడుదల తగ్గించి, మదురై నగర ప్రజల తాగునీటి కోసం 72 ఘనపుటడుగుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మరమ్మతులకు గురైన ఏసీ వ్యవస్థ

ఓమందురార్ జీహెచ్ సీలింగ్‌లో లీకేజీ ● ఇబ్బంది పడుతున్న రోగులు

వాషర్‌మెన్ పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఓమందురార్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సెంట్రలైజ్డ్ ఏసీ వ్యవస్థ మరమ్మతులకు గురి కావడంతో సీలింగ్‌లో లీకేజీ ఏర్పడి నీరు కారుతోంది. నీరు కారుతుండడంతో వార్డులు, కేర్ యూనిట్లు, నర్సింగ్ స్టేషన్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. లీకవుతున్న నీటిని బకెట్లలో సేకరిస్తున్నప్పటికీ, నేలంతా తడిగానే ఉంటోందని ఆస్పత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అటు రోగులకు, ఇటు సిబ్బందికీ ప్రమాదమేనని ఆందోళన చెందుతున్నారు. రోగులను పరామర్శించడానికి వచ్చే వారికి నేల తడిగా ఉండడం తెలియక జారి పడే ప్రమాదం ఉందంటున్నారు. ఆస్పత్రిలో వైద్యం బాగానే ఉందని, కానీ మౌలిక సదుపాయాలు దారుణంగా ఉన్నాయని ఇక్కడ చికిత్స పొందుతున్న రోగి ఒకరు తెలిపారు. ఆస్పత్రి నిర్మించిన సమయంలో ఏర్పాటు చేసిన ఏసీల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇలా లీకేజీ అవుతున్న సిబ్బంది చెబుతున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో సైతం ఏసీ పని చేయకపోగా, పైకప్పు నుంచి నీరు కారుతోందంటున్నారు. ఆస్పత్రిని వెలుపల నుండి చూస్తే అంతర్జాతీయ స్థాయిలో కనిపిస్తుందని అయితే వాస్తవానికి పైన పటారం లోన లొటారమేనని రోగులు ఆవేదన చెందుతున్నారు. ఈ భవనం తొలుత సచివాలయ సముదాయంగా నిర్మించారు.అయితే కొన్ని రాజకీయ పరిణామాల కారణంగా ఈ భవనం ఆస్పత్రిగా మార్చబడింది. కాగా గతంలో పైకప్పులు తొలగించి ఏసి మరమ్మతులు చేపట్టడానికి సులభంగా ఉండేదని, ఇప్పుడు రోగులు, సిబ్బంది, ప్రజలు ఇలా జనాలతో నిత్యం కిక్కిరిసి ఉండడంవలన ఆ పనులు సాధ్యం కావడం లేదని అధికారులు వెల్లడించారు. పని చేయని ఏసీలను తొలగించిన తరువాతే లీకేజి సమస్య పరిష్కారమవుతుందని అధికారులు స్పష్టం చేశారు.



ఓమందూరార్ ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో లీకవుతున్న నీరు

పెనుగాలులకు నేలకొరిగిన అరటి తోటలు

టి.నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా అవినాశి, సేవూరు పరిసర ప్రాంతాల్లో పెనుగాలులతో కూడిన కురిసిన భారీ వర్షాలకు సెంబియనల్లూరు, కదంబపాళయం తదితర ప్రాంతాల్లో రెండు వేలకుపైగా అరటి చెట్లు నేలకొరిగాయి. ఇదే విధంగా మంగరసువలయపాళయం, సాలయపాళయం, కానూరు, పులిప్పార్ ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న ఎరుపు అరటి, రస్తాలి రకాలకు చెందిన సుమారు 8 వేలకు పైగా అరటి చెట్లు కూలాయి. గత రెండు రోజులుగా అవినాశి, సేవూరు తదితర ప్రాంతాల్లో పెనుగాలులతో కూడిన కుండపోత వర్షానికి 10వేలకు పైగా అరటి చెట్లు కూలాయి. వర్షంలో కూలిన అరటి చెట్లకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సేవూరులో పెనుగాలులతో కూడిన వర్షానికి నేలమట్టమైన అరటిచెట్లు

పిళ్లయార్‌పట్టిలో వైభవంగా తీర్థవారి

టి.నగర్, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుపత్తూరు సమీపంలోని పిళ్లయార్‌పట్టిలోని సుప్రసిద్ధ కర్పగ వినాయక ఆలయంలో తమిళ ఉగాది సందర్భంగా సోమవారం ఉదయం తీర్థవారి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయాన్ని వేకువజామున 5 గంటలకు తెరచి, స్వామివారికి ప్రత్యేక అభిషేకం, దీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత మూలవిరాట్టును మూషిక వాహనంలో ఊరేగించారు. ఉదయం 9 గంటలకు ఆలయ తీర్థకొలను వద్ద అంకుశదేవర్, అస్త్రదేవర్ దర్శన వేడుకలు తీర్థవారి ఉత్సవం జరిగాయి. సాయంత్రం 6గంటలకు ఆలయంలో పంచాంగ పఠనం నిర్వహించారు. ఆ తర్వాత మూషికవాహనంలో కర్పగ వినాయకుడు, వృషభవాహనంలో చంద్రశేఖరస్వామి గౌరీదేవి సమేతుడై విహరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం, తాగునీటి వసతి, వైద్యసదుపాయం, ఎండవేడిమి తెలియకుండా కూలైన్లపై పైకప్పులు కూడా ఏర్పాటు చేశారు. ఆలయ పారంపర్యం ట్రస్టీలు నార్‌సాత్తుపట్టి కుమరప్పన్ శెట్టియార్, కారైక్కుడి చిద్ పళనియప్పన్ చెట్టియార్ వివిధ జిల్లాల నుండి విచ్చేసిన భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించారు.



పార్టీ నుంచి వైదొలగే ప్రసక్తే లేదు

● నాపై దుష్ప్రచారం ● మాజీ మంత్రి డి.జయకుమార్

టి.నగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఓడిపోవటానికి బీజేపీ కారణమని పదేపదే ఆరోపణలు చేస్తూ వచ్చిన అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ తాను పార్టీ నుంచి వైదొలగే ప్రసక్తే లేదంటూ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం బీజేపీతో తమ పార్టీ పొత్తు కుదుర్చుకోవడంతో తాను పార్టీకి రాజీనామా చేయనున్నట్లు సోషల్ మీడియాలో పనిగట్టుకుని ప్రత్యర్థులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ కూడా బీజేపీతో అన్నాడీఎంకే పొత్తుపెట్టుకుంటే రాజీనామా చేస్తానంటూ ఆయన వద్ద తెలిపినట్లు దురుద్దేశంతో వదంతులు పుట్టిస్తుండటం గర్హనీయమని పేర్కొన్నారు. తిరుమావళవన్‌తో తాను ఎప్పుడూ అలా చెప్పలేదని జయకుమార్ అన్నారు. తమ కుటుంబం 75 యేళ్లుగా ద్రావిడ సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటోందని పదవి కోసం ఎవరి కాళ్ళపైనా పడే మనస్తత్వం తనది కాదని చెప్పారు. పార్టీలో తనకు గుర్తింపు రావడానికి ఎంజీఆర్, జయలలిత తనపై చూపిన ఆదరాభిమానాలే ప్రధాన కారణమని చెప్పారు. పెరియార్, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత మార్గంలోనే తన జీవన ప్రయాణం కొనసాగుతుందని తెలిపారు.



కామధేనువుకు ప్రత్యేక పూజలు

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా ఉడుమలై చెల్లంపాళయంలోని ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో పంగుణి పౌర్ణమి సందర్భంగా కామధేనువుకు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు. అమృతం కోసం క్షీరసాగర మధనం చేసిన సమయంలో, కల్పవృక్షం, కామధేనువు, మహాలక్ష్మి తదితర దివ్య ఐశ్వర్యాలు పంగుణి పౌర్ణమి రోజున ఉద్భవించాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ కారణంగా పంగుణి పౌర్ణమి పురస్కరించుకుని చెల్లంపాళయంలోని ఆదికేశవ పెరుమాళ్ ఆలయంలో కామధేనువు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కామధేనువు

శ్రీలంక-ధనుష్కోటి మధ్య దివ్యాంగుల ఈత సాధన

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక తలైమన్నార్ నుంచి ధనుష్కోటి అరిచ్చల్‌మునై వరకు సముద్రంలో ఈది దివ్యాంగ యువకులు సాధన చేశాడు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన దివ్యాంగులు ధ్యాన్ (19), మనీష్ (49), సంతోష్ (46)లు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఈత కొలనులో శిక్షణ పొందుతున్నారు. వీరు పాక్ జలసంధి, శ్రీలంక నుంచి ధనుష్కోటి వరకు ఈదాలని నిర్ణయించుకున్నారు. ముగ్గురు ఆదివారం వేకువజామున 3.30 గంటలకు శ్రీలంక తలైమన్నార్ సముద్రంలో దిగి ఈదటం ప్రారంభించారు. వీరిలో, ధ్యాన్ పూర్తిస్థాయిలో ఈదగా, మిగిలిన ఇద్దరు అర కి.మీ ఒకరు చొప్పున విశ్రాంతి తీసుకుంటూ మారి మారి రిలే విధానంలో ఈదారు. 29 కి.మీ దూరం ఈది మధ్యాహ్నం 3.30 గంటలకు ధనుష్కోటి అరిచ్చల్‌మునై తీరానికి చేరుకున్న ముగ్గురిని భారత్ - శ్రీలంక స్విమ్మింగ్ జట్టు సమన్వయకర్త రోజర్, మెరైన్ పోలీసులు అభినందించారు.



మెట్రో రైల్వే ట్రాక్ మరమ్మతులు

● సేవలకు అంతరాయం

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలం నుంచి వింకో నగర్ వైపు వెళ్లే రైల్వే ట్రాక్ మరమ్మతులకు గురైంది. ఈ కారణంగా సోమవారం ఉదయం వింకో నగర్ నుంచి బయల్దేరే రైళ్లు, విమానాశ్రయం నుంచి కోయంబేడు మార్గంగా సెంట్రల్ వచ్చే మెట్రో రైళ్లు ఒకే మార్గంలో నడపాలని అధికారులు నిర్ణయించారు. దీంతో, విమానాశ్రయ రైల్వేస్టేషన్‌లోని ఒక మార్గంలో మెట్రోరైల్ సేవలు నిలిచిపోయాయి. ఈ కారణంగా ఉదయం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. విమానాశ్రయం నుంచి బయల్దేరే అన్ని మెట్రో రైళ్లు ఒకే మార్గంలో ఆలందూర్ వరకు నడిపారు. అందువల్ల రైళ్ల రాకపోకల్లో జాప్యం చోటుచేసుకుంది. మెట్రో ఉద్యోగులు మరమ్మతు చేయడంతో రైళ్లు యథావిధిగా నడిచాయి. సోమవారం సెలవు రోజు కావడంతో ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని అధికారులు తెలిపారు.



మెట్రోరైలు

ఉపకులపతులను నియమించండి

● అధ్యాపకుల సంఘం వినతి

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 8 విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవులు సత్వరం భర్తీ చేయాలని విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శవరణన్ విడుదల చేసిన ప్రకటనలో... గవర్నర్ చర్యలతో స్తంభించిన విశ్వవిద్యాలయాల పనితీరు, ముఖ్యమంత్రి న్యాయపోరాటం కారణంగా మళ్లీ మంచి రోజులు రానున్నాయన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 8 విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవులను సత్వరం భర్తీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, సేలం పెరియార్ విశ్వవిద్యాలయ ఉపకులపతి పదవీకాలం పొడిగింపు రద్దు చేయాలని, అళగప్ప విశ్వవిద్యాలయ అధ్యాపకుడు ప్రేమ్‌కుమార్ సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

60 తమిళ సంవత్సరాల పేర్లతో మెట్లు

● స్వామిమలై ఆలయంలో మెట్ల పూజ



మెట్లకు పసుపు, కుంకుమ రాసి పూజలు చేస్తున్న భక్తులు

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళ నూతన సంవత్సరం సందర్భంగా స్వామిమలై కొండకు 60 తమిళ సంవత్సరాల పేర్లతో ఏర్పాటు చేసిన మెట్లకు ప్రత్యేక పూజలు చేశారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని స్వామిమలైలోని మురుగన్ ఆలయం పేరుగాంచింది. ఈ ఆలయానికి వెళ్లే ప్రజలు 60 తమిళ సంవత్సరాల పేర్లతో కూడిన మెట్లకు పూజలు చేస్తుంటారు. తమిళ సంవత్సరాలు ప్రభవ, విభవ, సుక్కిల్, ప్రమోదాత అంటూ ప్రారంభమైన అక్షయ నెలతో ముగుస్తాయి. ఆ ప్రకారం, సోమవారం 60 తమిళ సంవత్సరాల జాబితాలో 37వ సంవత్సరమైన విశ్వావసు సంవత్సరం ప్రారంభం సందర్భంగా, భక్తులు ఒక్కో మెట్టుకు పసుపు, కుంకుమలు రాసి, టెంకాయ కొట్టి, కర్పూర హారతులిచ్చి పూజలు చేశారు. తమిళ ఉగాది సందర్భంగా ఉత్సవమూర్తి స్వామినాథస్వామికి ప్రత్యేక అభిషేక, ఆరాధనలు నిర్వహించారు.

అధికారం చేపట్టే స్థాయికి అభివృద్ధి

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అధికారం చేపట్టే స్థాయికి పార్టీని అభివృద్ధి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయాన్ని సోమవారం నయినార్ నాగేంద్రన్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు తమిళ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్నానని అన్నారు. అన్నామలై నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ అభివృద్ధి సాధించిందన్నారు. బీజేపీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారం చేపట్టేలా కృషి చేస్తానన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఈపీఎస్ నేతృత్వంలోని కూటమి మెజార్టీ స్థానాలు సాధించి అధికారం కైవసం చేసుకుంటుందని నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

బీమా సొమ్ము అందించని బ్యాంక్

● మృతుడి కుటుంబానికి రూ.25.35 లక్షలు అందించాలంటూ ఉత్తర్వులు

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సేవల లోపం కారణంగా బాధిత ఖాతాదారుడి కుటుంబానికి రూ.25.35 లక్షల నష్టపరిహారంతో పాటు పిటిషన్‌దారుడు రుణాన్ని రద్దు చేయాలని తూత్తుకుడి జిల్లా వినియోగదారుల ఫోరం బ్యాంకుకు ఉత్తర్వులు జారీ చేసింది. తూత్తుకుడికి చెందిన అరుణాచలం, తూత్తుకుడిలోని ప్రజారంగబ్యాంక్‌లో ఇంటి నిర్మాణం కోసంరుణం తీసుకున్నాడు.అందుకు ఒక లైఫ్ ఇన్సూరెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్‌కు నగదు చెల్లించాడు. కొద్దిరోజుల అనంతరం అనారోగ్యంకారణంగా అరుణాచలం మృతిచెందాడు.ఈ నేపథ్యంలో,బీమా సొమ్ము అందించడంతో పాటు రుణం మాఫీచేయాలంటూ మృతుడి భార్య కల్పన బ్యాంక్ అధికారులకు విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై బ్యాంక్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో కల్పన, తూత్తుకుడి జిల్లా వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ విచారించిన ఫోరం అధ్యక్షుడు తిరుసీల ప్రసాద్, సభ్యుడు శంకర్ వెలువరించిన తీర్పులో... మృతుడి రుణాన్ని బ్యాంక్ రద్దు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బీమా సొమ్ముగా రూ.25 లక్షలు, సేవల జాప్యం కారణంగా మానసికక్షోభ అనుభవించిన పిటిషన్‌దారుడికి రూ.25 వేలు, కేసు ఖర్చులకు రూ.10 వేలు అందించాలని, ఈ తీర్పు ప్రకారం పరిహారం చెల్లించే తేది వరకు ఏడాది 9 శాతం చొప్పున చెల్లించాలని తీర్పు వెలువరించారు.

అంబేడ్కర్‌కు ఘననివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న మంత్రి దురైమురుగన్, కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ, ఎమ్మెల్యేలు

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలు సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి నివాళులర్పించారు. అనంతరం మంత్రి దురైమురుగన్, వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు కార్తికేయన్, నందకుమార్, అమ్ములు విజయ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా ఇటీవల చిరుత దాడిలో మృతిచెందిన మహిళ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారాన్ని మంత్రి దురైమురుగన్ అందజేశారు. అలాగే, కాట్పాడిలోని రంగాలయ వివాహ మండపంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, వివిధ శాఖల ఆధ్వర్యంలో 1,523 మందికి రూ.11.30 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాలు సహా పలువురు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానం అమలు చేయాలి

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ విధానం అమలు, ఖాళీ పోస్టుల భర్తీ సహా దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ సంఘ సమావేశం సోమవారం స్థానిక సత్తువాచేరిలోని సంఘ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షత వహించగా, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజవేలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా నిర్వాహకులు జయపాల్ ఆహ్వానం పలకగా దక్షిణామూర్తి, మునుస్వామి, ముత్తుస్వామి, మనోహరన్, మణి, మదన్‌కుమార్ సహా పలువురు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ఆ పద్ధతి మార్చుకోవాలని కోరారు. సమస్యల సాధనకు ఆందోళనలు ఉధృతం చేయాలని సమావేశంలో తీర్మానించారు.



సమావేశంలో పాల్గొన్న నిర్వాహకులు

ఈదురుగాలులకు కూలిన అరటి చెట్లు

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బెడుగత్తూర్, కీల్‌కొత్తూరు, వరదాలమ్‌పట్టు, పెరియేరియార్, గంగెసాని కుప్పం సహా పలు ప్రాంతాల్లో రైతులు అరటి సాగు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి హఠాత్తుగా సంభవించిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి సుమారు 5 వేల అరటి చెట్లు నేలకూలాయి. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి నిరసనగా ఎన్టీకే ధర్నా

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతూ నామ్ తమిళర్ కచ్చి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక అన్నా ఆడిటోరియం సమీపంలో సోమ వారం ఉదయం చేపట్టిన ధర్నాలో సుమారు 1000 మందికి పైగా కార్యకర్తలు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ చర్యలు నిరసిస్తూ నినాదాలు చేశారు.



ఆందోళనలో నేతలు, కార్యకర్తలు

కుట్టు మెషిన్ల పంపిణీ

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రోటరీ సంఘం ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు కుట్టు మెషిన్లు అందజేశారు. సోమ వారం ఉదయం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం గవర్నర్ రాజన్‌బాబు హాజరయ్యారు. మహిళలకు కుట్టు మెషిన్లు, ఆసుపత్రికి వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, ఆడిటర్ రోటరీ రమేష్, సెక్రటరీ రోటరీ వెంకటేష్, కోశాధికారి కార్తీక్, ఏజీ అడ్మిన్ యోగనాథన్, బషీర్, బాలాజి, దామోదరన్, కలైమగల్ ట్రాన్స్‌పోర్ట్ ఇళంగోవన్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మెషిన్లు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేడుకగా ఊరీసు కళాశాల 126వ వార్షికోత్సవం

వేలూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఊరీసు కళాశాల 126వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేల్‌విశారం అబ్దుల్ హకీం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాజిత్ పాల్గొని, పలు క్రీడా పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు, మాజీ ఉపాధ్యాయులు, ఉద్యోగులను కళాశాల యాజమాన్యం తరఫున సత్కరించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

తిరుకోవిలూరు వద్ద రోడ్డు ప్రమాదం

● ఏడు నెలల చిన్నారి సహా ముగ్గురి మృతి

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఏడు నెలల చిన్నారి సహా ముగ్గురు మృత్యువాతపడ్డారు. కళ్లకురిచ్చి జిల్లా తిరుకోవిలూర్ సమీపం మేమలూరు ఆలయ వీధికి చెందిన అలెక్స్ విజయ్(25) వ్యవసాయ కూలీ. ఆయన భార్య అరుళ్‌మేరి 22), ఏడు నెలల కుమారుడు అంథోని జాషువాతో కలసి శివగంగ జిల్లా దేవకోటలోని చెరకు తోటలో పనులకు ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో తిరుచ్చి శ్రీరంగం సమీపంలో వస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుకగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. ద్విచక్రవాహనం నుంచి కిందపడిన అరుళ్ మేరి, అలెక్స్ విజయ్‌పై వ్యాన్ చక్రం ఎక్కడంతో ఇద్దరూ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను చుట్టుపక్కల వారు తిరుచ్చి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక సోమవారం ఉదయం మృతిచెందాడు. ఈ ఘటనపై తిరుచ్చి ఉత్తరం ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి, తిరుచ్చి జిల్లా మానామదురైకి చెందిన వ్యాన్ డ్రైవర్ కదిరేశన్ (43) కోసం గాలిస్తున్నారు.

దీపావళి చిట్టీల పేరుతో రూ.33 లక్షల మోసం

పెరంబూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి చిట్టీల పేరుతో రూ.33 లక్షలు మోసం చేసిన నగల దుకాణం యజమానిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా బన్రూటి సమీపం పక్కిరిపాళయానికి చెందిన ప్రభు కడలూరులో నగలు దుకాణం నిర్వహిస్తున్నాడు. అలాగే దీపావళి చిట్టీల పేరుతో పలువురి నుంచి నగదు వసూలు చేశాడు. కాలపరిమితి ముగిసినా బంగారు నాణెం, నగదు ఇవ్వకపోవడంతో చీటీదారులు అతనిని ప్రశ్నించారు. దీంతో, దుకాణం మూసివేసి ప్రభు అదృశ్యమయ్యాడు. బాధితుల ఫిర్యాదుతో ప్రభును ఆదివారం అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఆదేశాలతో జైలుకు తరలించారు.

సెప్టెంబరులో శివకార్తికేయన్ 'మదరాసి'!

చిత్రజ్యోతి


మురుగదాస్ - శివకార్తికేయన్

ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా 'మదరాసి' పేరుతో రూపొందుతున్న చిత్రాన్ని సెప్టెంబరు 5న విడుదల చేయాలని నిర్మాత భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం చివరి దశ చిత్రీకరణ పనులను పూర్తి చేసేందుకు దర్శకుడు సమాయాత్తమవుతున్నారు. ఈ సినిమా ప్రారంభించిన తర్వాత మురుగదాస్ 'సికిందర్' అనే బాలీవుడ్ మూవీ రూపొందించగా, అది ఇటీవల విడుదలై ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో మురుగదాస్ తిరిగి తన దృష్టిని 'మదరాసి'పై కేంద్రీకరించారు. నటీనటుల తేదీలను ఖరారు చేసుకునే పనిలో నిమగ్నమైనారు. షూటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు అనుగుణంగానే ఓటీటీ, శాటిలైట్ హక్కులను విక్రయించేందుకు చర్చలు కూడా జరుగుతున్నాయి. ఇప్పటివరకు మ్యూజిక్, విదేశీ హక్కులను మాత్రమే విక్రయించారు. కాగా, ఈ చిత్రంలో శివ కార్తికేయన్, బిజూ మేనన్, విద్యుత్ జమ్వాల్, రుక్మిణి వసంత్, షబీర్, విక్రాంత్, అరుణ్ వెంజురముడు తదితరులు నటించారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గాను, అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చనున్నారు.


'ఇడిముళక్కం'లో ఓ దృశ్యం

త్వరలో తెరపైకి ఇడిముళక్కం

శీను రామస్వామి దర్శకత్వంలో జీవీ ప్రకాష్‌కుమార్ హీరోగా నటించిన 'ఇడిముళక్కం' చిత్రాన్ని మే నెలలో విడుదల చేయనున్నట్టు నిర్మాతలు సోమవారం అధికారికంగా ప్రకటించారు. 2021లోనే చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని విడుదలకు నోచుకోని చిత్రాల జాబితాలో 'ఇడిముళక్కం' ఉంది. ఇపుడు ఈ మూవీని థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో జీవీ ప్రకాష్ కుమార్ సరసన గాయత్రి నటించగా, ఇతర పాత్రల్లో గంజాకరుప్పు, శరణ్య, ఎంఎస్ భాస్కర్, బాబా భాస్కర్, కాయల్ దేవరాజ్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. ప్రముఖ రచయిత జయమోహన్ రచించిన కథ ఆధారంగా గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కించారు. ఈ సినిమాకు కెమెరా ఏఆర్ అశోక్‌కుమార్, సంగీతం ఎన్ఆర్ రఘునాథన్.

అర్జున్‌దాస్ సరసన మమిత బైజు



హీరో, విలన్ పాత్రల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న నటుడు అర్జున్ దాస్... ప్రస్తుతం హీరోగా బిజీ అవుతున్నారు. దీంతో ఆయనకు హీరోగా వరుస అవకాశాలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో డెబ్యూ డైరెక్టర్ విఘ్నేష్ దర్శకత్వం వహించే చిత్రంలో హీరోగా నటించనున్నారు. ఇందులో హీరోయిన్‌గా మమిత బైజును ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. అయితే, అనేక చిత్రాల్లో నటిస్తూ ఎంతో బిజీ హీరోయిన్‌గా మారిన మమిత బైజు.. అర్జున్‌దాస్ చిత్రంలో నటించేందుకు సమ్మతిస్తారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కాగా, తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీగా మారిన అర్జున్‌దాస్... తమిళంలో 'మాస్టర్', 'ఖైదీ', 'అనీది', 'రసవాది' వంటి హిట్ చిత్రాల్లో నటించారు. తాజాగా అజిత్ కుమార్ హీరోగా నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీలో విలన్ పాత్రను పోషించగా, ఆయన పాత్రకు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది.


'అం ఆ'లో దేవదర్శిని

తల్లి గొప్పతనాన్ని చాటిచెప్పే 'అం ఆ'

మలయాళంలో విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'అం ఆ' తమిళ అనువాద చిత్రం ఈనెల 18న విడుదలకానుంది. తల్లి గొప్పతనం, ఆప్యాయత, త్యాగాన్ని చాటి చెప్పే చిత్రంగా రూపొందించారు. థామస్ సెబాస్టియన్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో దిలీప్‌పోతన్, దేవదర్శిని ప్రధాన పాత్రలను పోషించారు. ఈ మూవీ ట్రైలర్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి అధికారికంగా విడుదల చేసి, చిత్ర బృందానికి శుభాకంక్షలు చెప్పారు. మలయాళంలో విడుదలై ఘన విజయం సాధించిన ఈ చిత్రం ఇప్పటికే 60 రోజులు పూర్తి చేసుకుంది. తల్లిపాత్రలో తమిళ నటి దేవదర్శిని నటించారు. ఇతర పాత్రల్లో జాఫర్ ఇడుక్కి, మీరా వాసుదేవ్, టీజీ రవి, శృతి జయన్, అలెన్సీయర్, మాలా పార్వతి, జయరాజన్ కోళికోడ్, ముత్తుమణి, నావాజ్ వల్లికున్ను, బేబీ నిహారా, నంజియమ్మ తదితరులు నటించారు. అనిశ్లాల్ ఆర్ఎస్ సినిమాటోగ్రఫి అందించగా, గోపీసుందర్ సంగీత స్వరాలను సమకూర్చారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి


పాలవాక్కంలో అంబేడ్కర్ విగ్రహానికి తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ నివాళి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు, డీపీఐ ఎంపీ తిరుమావళవన్ - అన్నామలైపురంలోని అంబేడ్కర్ మణిమంటపంలో మంత్రులతో సమైక్యత ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఎం స్టాలిన్

ప్యారీస్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల్లో కేకులు కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేసి పేదలకు సంక్షేమ సహాయాలు అందించారు.

అంబేడ్కర్ మణిమంటపంలో...

రాజా అన్నామలైపురంలోని అంబేడ్కర్ మణి మంటపానికి సీఎం స్టాలిన్ రాష్ట్రమంత్రులతో కలిసి నేరుగావెళ్లి అక్కడున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ సమర్పించి ఘన నివాళులర్పించారు. ముఖ్యమంత్రిని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ ఆహ్వానించారు. అనంతరం ముఖ్యమంత్రి 'కుల వివక్షకు వ్యతిరేకంగా, కులాలపేరుతో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా అందరూ కలిసి పోరాడుదాం, సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దాం, జీవితాంతం సమైక్యతను పాటిస్తాం' అని మంత్రులు, దళిత నేతలతో సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రసమాచార శాఖ డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్, అడిషనల్ డైరెక్టర్ సెల్వరాజ్, అధికారులు పాల్గొన్నారు.


గిండిలోని రాజ్‌భవన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళి

- గిండిలోని రాజ్‌భవన్ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి గవర్నర్ ఆర్ఎన్ రవి పూలదండలు వేసి నివాళులర్పించారు. రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధాన కార్యాలయం సత్యమూర్తిభవన్‌లో పూలతో అలంకరించిన వేదికపై ఏర్పాటు చేసిన అంబేడ్కర్ చిత్రపటానికి టీఎన్‌సీసీ అధ్యక్షులు సెల్వపెరుందగై, ఎమ్మెల్యేలు రూబీ మనోహరన్, హసన్ మౌలానా, కేంద్ర మాజీ మంత్రి తంగబాలు తదితరులు నివాళులర్పించారు. చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర బీజేపీ నేతలతో కలిసి తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై నివాళులర్పించారు. అనంతరం తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే.వాసన్, రాష్ట్ర నిర్వాహకులు జీఆర్.వెంకటేష్, కేఆర్.రమేష్, జిల్లా అధ్యక్షులు ఈకే. అరుణ్‌కుమార్, బిజుచాకో, మహిళా కార్యకర్తలు నివాళులర్పించారు. పాలవాక్కంలో అంబేడ్కర్ విగ్రహానికి తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ పూలు చల్లి నివాళులర్పించారు. సేలంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అంబేడ్కర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులర్పించారు. అలాగే అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కోడంబాక్కం పవర్‌హౌస్ జంక్షన్‌లోవున్న అంబేడ్కర్ విగ్రహానికి అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీమంత్రులు డి.జయకుమార్, పొన్నయ్యన్, వలర్మతి, బెంజమిన్, గోకుల ఇందిరా, ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునిల్, విరుగై రవి, మాజీ ఎంపీ జయవర్ధన్ తదితరులు నివాళులర్పించారు. కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత పార్టీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పించారు. అలాగే రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ కన్నియాకుమారిలో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలదండలు వేసి నివాళులర్పించారు.


సేలంలో అన్నాడీఎంకే శ్రేణులతో కలిసి అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి


కోడంబాక్కంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే సీనియర్ నేతలు పొన్నయ్యన్, పి.బెంజిమెన్ తదితరులు


కోడంబాక్కంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అన్నాడీఎంకే ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, మాజీ మంత్రులు


టీఎంసీ ఆధ్వర్యంలో జరుపుకున్న వేడుకల్లో ఆ పార్టీ అధ్యక్షుడు జీకేవాసన్‌ను సత్కరిస్తున్న జీఆర్ వెంకటేష్ తదితరులు


కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్‌కు పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత నివాళి


కన్నియాకుమారిలో బీజేపీ శ్రేణులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

మహనీయుల బాటలో నడవడం హర్షణీయం

- చెన్నై కస్టమ్స్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ



మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘ నిర్వాహకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కస్టమ్స్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ

ప్యారీస్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మహనీయుల బాటలో నడవడం హర్షణీయమని, భారత రాజ్యాంగం ద్వారానే సమానత్వం సాధ్యమవుతుందని చెన్నై కస్టమ్స్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ గోపాలకృష్ణ అన్నారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని హార్బర్ సమీపంలో ఉన్న చెన్నై కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలో మద్రాస్ కస్టమ్స్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో ఘనంగా వేడకలు జరుపుకున్నారు. సంఘ అధ్యక్షుడు ఎం.కలైకుమార్, ట్రెజరర్ ఎంఎస్ కార్తికేయన్, ఉపాధ్యక్షులు పి.ఆదిలక్ష్మణ్, బాబు తదితరులతో పాటు గోపాలకృష్ణ... అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం 60 మందికి దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముందుగా అందరూ సమైక్యత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ... కులవివక్షను అంతంచేసి సమానత్వం పెంపొందింపజేసి, సమ సమాజాన్ని నిర్మించిన దార్శనికుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు.

తెలుగు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా అంబేడ్కర్ జయంతి


హార్బర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్ తదితరుల నివాళి

ప్యారీస్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలోని పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పుళల్ కావాంగరైలోని తెలుగు ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గౌరవ అధ్యక్షుడు లయన్ జి.మురళి, అధ్యక్షుడు నరసింహారావు, అన్నాడీఎంకే ప్రముఖులు ఎం.సుందర్, బాలాజీ, సంపత్ అంబేడ్కర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలో పెరియమెట్ లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తమిళనాడు ఆదిఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) వ్యవస్థాపకులు, జనోదయం డైరెక్టర్ డాక్టర్ గొల్లపల్లి ఇశ్రాయేలు నేతృత్వంలో సంస్థ నిర్వాహకులు నివాళులర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ తమిళనాడు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎం.కొండయ్య, కార్యదర్శి కె.సుకుమార్, అధికారి ప్రతినిధి కె.కుమార్, వి.విశ్వప్రసాద్, దేవసహాయం, శ్రీనివాసులు, భాస్కర్, లక్ష్మీనారాయణ, జి.గోపి, యోహాను, రంగయ్య తదితరులు నివాళులర్పించారు. కొడింగియార్ చిన్నాండి మఠంలోని అంబేడ్కర్ శిలావిగ్రహానికి జనని సాంస్కృతిక సంఘం ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, రెప్కో బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ వంజరపు శివయ్య పూలదండలు సమర్పించి నివాళులర్పించారు. ఆవడి రామరత్న థియేటర్ జంక్షన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టామ్స్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి ఇశ్రాయేలు సూచనల మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు నేలటూరి విజయ్‌కుమార్, ఆవడి ఇశ్రాయేలు, అద్దంకి ఐసయ్య, థామస్, భాస్కర్, సాల్మన్, వీరరాఘవులు చంద్రలోక్, అగస్టియన్ తదితరులు అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పాదచారులు, వాహనచోదకులకు మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేశారు. హార్బర్ ప్రాంతంలోని చెన్నై పోర్ట్ ట్రస్ట్ ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్‌కుమార్, బి.వసంతరావు, దర్శిగుంట శేషయ్య కిషోర్, వేణుగోపాల్, గోపి, ఆంథోని, శ్రీనివాసులు తదితరులు పూలు చల్లి నివాళులర్పించారు.

సీపీఏ ఆధ్వర్యంలో ...


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ సునీల్ పాలీవాల్, డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్ తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్ నియోజకవర్గం చెన్నై పోర్ట్ అథారిటీ (సీపీఏ) కార్యాలయ ప్రాంగణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి సీపీఏ చైర్‌పర్సన్ సునీల్ పాలీవాల్, డిప్యూటీ చైర్‌పర్సన్ ఎస్.విశ్వనాథన్, సీనియర్ అధికారులు, ఉద్యోగులు పూలు చల్లి నివాళులర్పించారు.


పుళల్ కావాంగరైలోని తెలుగు ప్రజల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న లయన్ జి.మురళి, ఎం.సుందర్ తదితరులు



పెరియమెట్‌లో టామ్స్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి ఇశ్రాయేలు నేతృత్వంలో అంబేడ్కర్‌కు నివాళి - కొడింగియార్ చిన్నాండి మఠంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గుడిమెట్ల చెన్నయ్య, వంజరపు శివయ్య తదితరులు


పెరియమెట్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఎం కొండయ్య, కె.కుమార్ తదితరుల నివాళి


ఆవడిలో టామ్స్ రాష్ట్ర అధ్యక్షుడు నేలటూరి విజయ్‌కుమార్ తదితరుల నివాళి

చిత్రజ్యోతి
SINCE 1965

భావోద్వేగాలు నిండిన చిత్రం



- ప్రదీప్ చిలుకూరి

'రాజా చెయ్యివేస్తే' ఫేమ్ ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా నటించారు. ఎన్టీఆర్ ఆర్ట్ బేనర్‌పై అశోక్‌వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. ఈనెల 18న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. "కల్యాణ్‌రామ్‌తో ఓ మాస్ సినిమా చేద్దామని ఆలోచిస్తున్న సమయంలో ఓ ఆసక్తికరమైన ఐడియా పుట్టింది. వెంటనే ఆ లైన్‌ను కల్యాణ్‌రామ్‌కు చెబితే, ఆయనకు నచ్చింది. కానీ, అందులో తల్లి పాత్రలో విజయశాంతి నటిస్తేనే ముందుకు వెళ్దామని చెప్పారు. విజయశాంతికి కూడా తన పాత్ర నచ్చడంతో అంగీకరించారు. ఈ సినిమాలో క్లైమాక్స్ కీలకం. ఓ తల్లి కోసం తనయుడు ఏం చేసినా తక్కువే అని చూపించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయి. 'అమిగో', 'డెవిల్' లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేసిన తర్వాత కల్యాణ్‌రామ్ చేసిన పూర్తి స్థాయి యాక్షన్ చిత్రమిది. భావోద్వేగాలు, అద్భుతమైన పోరాట ఘట్టాలు గల ఈ సినిమా మాస్ ఆడియెన్స్‌తో పాటు కుటుంబ ప్రేక్షకులకూ నచ్చుతుంది. కల్యాణ్‌రామ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు, సంభాషణలు, సంగీతం ఈ సినిమాకు ప్రధానాకర్షణ. తప్పకుండా విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

సరికొత్త అనుభూతినిస్తుంది



- సంపత్‌నంది

దర్శకుడు సంపత్‌నంది దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిన చిత్రం 'ఓదెల 2'. 2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి ఇది సీక్వెల్. ఈ చిత్రానికి సంపత్ నంది కథను అందించి సమర్పకుడిగా వ్యవహరించారు. అశోక్ తేజ దర్శకత్వంలో మధు నిర్మించారు. ఈ నెల 17న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు సంపత్‌నంది. "ఈ సినిమా మొదటి భాగం తీస్తున్నప్పుడు పార్ట్ 2 గురించి ఆలోచించలేదు. కానీ చివరలో లీడ్ అయితే ఇచ్చాం. మొదటి భాగంలో హెబ్బా క్యారెక్టర్ సినిమాకే ప్లస్ అయ్యింది. అందుకే ఇందులో దుష్టశక్తితో పోరాడేందుకు ఓ బలమైన ఫిమేల్ క్యారెక్టర్ ఉంటే బాగుంటుందనిపించి తమన్నా పాత్రను సృష్టించాం. ఓ ఆత్మకు, సూపర్ నేచురల్ పవర్స్‌కు మధ్య జరిగే ఆసక్తికరమైన పోరు ఈ సినిమా కథాంశం. ప్రేక్షకులకు సరికొత్త విజువల్ అనుభూతిని పంచుతుంది. ఈ కథను రాసేందుకు చాలా పరిశోధన చేశాం. శివశక్తి, నాగసాధువులుగా మారతారని, శివాలయాలను శుద్ధి చేస్తారని.. ఇలా ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. ఆ క్రమంలోనే ఈ సినిమాలో శక్తిమంతమైన నాగసాధు పాత్ర తయారైంది. తమన్నా ఇందులో తన లుక్ కోసం చాలా శ్రమించారు. సినిమాలో గ్రాఫిక్స్ పార్ట్ అధికంగా ఉంటుంది. ఆ విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతాయి. దర్శకుడు అశోక్ ప్రతిభావంతుడు. ఆయన మేకింగ్ అదిరిపోతుంది" అని చెప్పారు.

మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది



నాని

నాని కథానాయకుడిగా 'హిట్' చిత్రాల ఫేమ్ శైలేష్ కొలను తెరకెక్కించిన చిత్రం 'హిట్ 3'. శ్రీనిధి శెట్టి కథానాయిక. వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే ఒకటిన చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. సోమవారం చిత్రట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ మధ్య వస్తున్న సినిమాల ట్రైలర్‌లు ఆ సినిమాల విడుదలకు ఒక రోజో.. రెండు రోజుల ముందో వస్తున్నాయి. కానీ, ఒకప్పుడు ట్రైలర్‌లు సినిమా విడుదలకు 20 రోజుల ముందే విడుదల అయ్యేవి. అందుకే ఆ పాత రోజుల్ని గుర్తుచేయాలనే ట్రైలర్‌ను ముందుగానే విడుదల చేశాం. తెలుగు ప్రేక్షకులకు పరిచయం లేని ఓ సరికొత్త జానర్‌లో చేసిన చిత్రమిది. కొత్తగా ప్రయత్నించిన ప్రతీసారి ప్రేక్షకులు గెలిపించారు. మే ఒకటిన మరోసారి గెలిపిస్తారనే నమ్మకం ఉంది. నేను యాక్షన్ సినిమాలు చేయాలని కోరుకునే వాళ్లంతా ఆ రోజు థియేటర్లకు వచ్చేయండి. నేను లవ్‌స్టోరీలు, ఫీల్ గుడ్, కామెడీ, కుటుంబ చిత్రాలు చేయాలనుకునే వారు ఆ రోజు కాస్త జాగ్రత్తగా ఉండండి. సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. బలమైన భావోద్వేగాలతో నిండిన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయి" అని చెప్పారు. "సినిమా యూనిక్‌గా ఉంటుంది. నాని నటన ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకెళ్తుంది. ప్రతీ సన్నివేశం విజిల్స్ కొట్టేలా ఉంటుంది. 'అర్జున్ సర్కార్' ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాడు" అని దర్శకుడు శైలేష్ కొలను చెప్పారు.

విజువల్ వండర్



'అమరన్'తో సూపర్‌హిట్ అందుకున్న తమిళ నటుడు శివకార్తీకేయన్ నటిస్తున్న చిత్రం 'మదరాసి'. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మి మూవీస్ నిర్మిస్తోంది. రుక్మిణీ వసంత్ కథానాయిక. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. సెప్టెంబరు 5న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రాఫర్: సుదీప్ ఎలామోన్, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకు?



ఇండస్ట్రీలో హీరో, హీరోయిన్ ఒకేలా కష్టపడుతున్నప్పుడు పారితోషికాల్లో వ్యత్యాసం ఎందుకని నటి సమంత ప్రశ్నించారు. కథానాయికలు ఈ విషయంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని అన్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న ఈ అసమానతలపై సమంత ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'హీరో, హీరోయిన్ సమాన ప్రాతినిధ్యం ఉన్న పాత్రల్లో నటించినప్పటికీ పారితోషికం విషయంలో మాత్రం వ్యత్యాసం ఉంటోంది. పరిశ్రమలో నన్ను ఇబ్బందిపెట్టే విషయాల్లో ఇదొకటి. దీనిలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా. గత పరిస్థితులను నేను మార్చలేను. మార్పు నాతోనే మొదలవ్వాలని నా సంస్థలో ఇలాంటి వ్యత్యాసం రాకుండా చూసుకుంటున్నాను' అని చెప్పారు.

తమిళ భాషకు డిజిటల్ మెమోరియల్



ప్రపంచ ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తమిళానికి మరింత గుర్తింపు తెచ్చేలా 'డిజిటల్ మెమోరియల్'ని రూపొందించనున్నట్టు సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ వెల్లడించారు. తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన సందేశాన్ని వెల్లడిస్తూ, 'ప్రపంచ స్థాయి భాషలలో పరిణామం చెందుతూ అత్యంత శక్తిమంతమైన భాషగా తమిళం గుర్తింపు పొందింది. తమిళ భాషను ప్రపంచ వ్యాప్తం చేయడంలో తమిళ సంఘాల కృషి ముఖ్యమైనది. భాషను బలోపేతం చేయడంతో పాటు సవరణలు చేయడం ద్వారా దానిని సుసంపన్నం చేయడంలో ముఖ్యమైన పాత్రను పోషించాయి. వినూత్నమైన, అర్థవంతమైన మార్గాల్లో తమిళ భాషను తరువాతి తరానికి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనకుంది. తమిళ సాహిత్యం, సంస్కృతులను డిజిటలీకరణ చేసేందుకు, తమిళ భాషకు మరింత గౌరవం కల్పించేలా తమిళ సాహిత్యాన్ని వివిధ రూపాల్లో ప్రదర్శించేందుకు ఏఆర్ఆర్ ఇమ్మర్సివ్ ఎంటర్‌టైన్మెంట్ (ఏఆర్ఆర్ స్టూడియో) కృషి చేస్తుంది. తమిళ గౌరవాన్ని డిజిటల్ రెండరింగ్‌గా తయారు చేసేపనిలో నిమగ్నమై ఉంది. ఇది తమిళ భాష భవిష్యత్‌కు ఒక గర్వకారణంగా నిలుస్తుందని భావిస్తున్నాం' అని రెహ్మాన్ పేర్కొన్నారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

జాట్ దర్శకుడికి తమిళుల హెచ్చరిక



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా తెలుగు దర్శకుడు గోపిచంద్ మలినేని తెరకెక్కించిన చిత్రం 'జాట్'. మైత్రీ మూవీ మేకర్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఇటీవలె విడుదలైన ఈ చిత్రాన్ని బహిష్కరించాలని కోరుతూ సోషల్ మీడియా 'ఎక్స్'లో 'బాయ్‌కాట్ మూవీ' హ్యాష్ ట్యాగ్ వైరల్ అవుతోంది. ఎల్‌టీటీఈని ఒక ఉగ్రవాద సంస్థగా ఈ సినిమాలో చిత్రీకరించారంటూ కొందరు తమిళులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో అడుగుపెడితే దర్శకుడు గోపిచంద్ మలినేనికి తగిన బుద్ధి చెబుతామంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ సినిమాలో ఎల్‌టీటీఈ పేరు ప్రస్తావించనప్పటికీ ఆ మార్క్ చూపుతూ సినిమా తీశారని కొందరు తమిళులు ఆరోపిస్తున్నారు.

బాలీవుడ్ చిత్రంలో పృథ్వీరాజ్



'ఎల్-2:ఎంపురాన్' చిత్రంతో దర్శకుడిగా విజయం సాధించారు మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఇప్పుడు బాలీవుడ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారికంగా ప్రకటించారు. మేఘనా గుల్జార్ నిర్మించనున్న 'దైరా' అనే మూవీలో పృథ్వీరాజ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్‌ని ఎంపిక చేశారు. ఈ సినిమా గురించి పృథ్వీరాజ్ మీడియాతో మాట్లాడుతూ 'స్క్రిప్ట్ వినగానే ఆసక్తిగా అనిపించింది. ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే పాత్ర నాది. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా ఈ సినిమాలో నటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టుపై కరీనా కూడా ఆనందం వ్యక్తం చేశారు' అని చెప్పారు.

ఏదో జరిగినే యెద లోపలా..



రాహుల్ విజయ్, నేహా పాండే జంటగా అశోక్‌రెడ్డి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఖేల్ ఖతమ్ దర్వాజ బంద్'. వేదాన్ష్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై అర్జున్ దాస్యన్ నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా నుంచి 'ఏదో ఏదో..' అనే పాటను చిత్రబృందం సోమవారం విడుదల చేసింది. పూర్ణాచారి సాహిత్యానికి సురేశ్ బొబ్బిలి సంగీతం సమకూర్చారు. కార్తీక్, హారిణి ఆలపించారు. 'ఏదో ఏదో ఏదో జరిగెనే యెద లోపలా, ఏవో ఏవో కలలు విరిసినే, నిన్నా మొన్నా లేదే..' అంటూ ఆకట్టుకునేలా సాగతుందీ పాట.

వేశ్య పాత్ర... రీ ఎంట్రీ!



శివాజీ, నవదీప్, బిందు మాధవి ప్రధాన పాత్రల్లో మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'కలర్‌ఫొటో', 'బెదురు లంక 2012' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన రవీంద్ర బెనర్జీ ముప్పానేని ఈ చిత్రానికి నిర్మాత. ఈ చిత్రం రెండో షెడ్యూల్ శరవేగంగా సాగుతోంది. 25 రోజులపాటు కొనసాగే చిత్రీకరణలో నటి బిందు మాధవి భాగమయ్యారు. చాలా కాలం తర్వాత బిందు మాధవి ఈ సినిమా ద్వారా రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆమె వేశ్య పాత్రలో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు మార్క్ కె.రాబిన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.




ధ్వజస్తంభానికి మొక్కి


అఖిలాండం వద్ద టెంకాయకొట్టి


హారతిచ్చి




అన్నదానానికి బిడ్డపేర విరాళమిచ్చి, భక్తులకు వడ్డించి

బిడ్డ కోసం..

ఆమె ఈ నేలమీద పుట్టలేదు. ఆమె హిందువు కాదు. ఆమె ఆచార వ్యవహారాలు భిన్నమైనవి. అయినా హిందూ విశ్వాసాలకు కట్టుబడ్డారు. పూజాపునస్కారాలు చేసి, మన ఆచారాలు పాటించారు. బిడ్డ కోసం ఒక తల్లి పడ్డ తపన ఇది. పవన్‌కల్యాణ్ సహచరి అన్నా లెజినోవా రెండు రోజులుగా తిరుమలలో వ్యవహరించిన తీరు అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో తమ కుమారుడు మార్క్ శంకర్ గాయపడడంతో తల్లడిల్లిన ఆ తల్లి.. స్వల్పగాయాలతో క్షేమంగా బిడ్డ బయటపడడంతో తేలికపడి, తిరుమల కొండకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రష్యాలో పుట్టి పెరిగిన అన్నా లెజినోవా క్రిస్టియన్ అయినప్పటికీ శ్రీవేంకటేశ్వరుడిమీద సంపూర్ణ విశ్వాసం ప్రకటిస్తూ సంతకం చేశారు. హిందూ ఆచారాలకు అనుగుణంగా గుండు చేసుకుని, స్వామిని దర్శించుకున్నారు.


తనూ అందరితో కలిసి భోంచేసి..

నవ్వుతో సంతోషకరమైన జీవితం



క్యూర్ ఈజ్ ష్యూర్ సదస్సులో మోనికా సింఘాల్ తదితరులు

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సంతోషకరమైన జీవితానికి ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండాలని, తమ సంస్థ ప్రజల చిరునవ్వులను వ్యాప్తి చేయడంలో సహాయ పడుతుందని 'హరి ఓం స్మైల్' సంస్థ వ్యవస్థాపకురాలు మోనికా సింఘాల్ తెలిపారు. చెట్‌పేట్‌లోని చిన్మయా హెరిటేజ్ సెంటర్‌లో 'క్యూర్ ఈజ్ ష్యూర్' పేరుతో ప్రత్యేక సదస్సు నిర్వహించింది. సుమారు వెయ్యిమంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో మోనికా సింఘాల్ మాట్లాడుతూ.. వ్యక్తిగత వృద్ధిని ఉత్ప్రేరకపరచడానికి మంత్రాలు, శక్తి వైద్యం వంటి పద్ధతులను ఉపయోగించి ఉనికి సారాంశాన్ని సంగ్రహించే ఉచిత మధ్యవర్తిత్వ సెషన్‌లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో క్వాంటం ఫిజిక్స్ మద్దతుతో ధ్యానం, మంత్రాలు, శక్తి వైద్యంను మిళితం చేసే విజయవంతమైన సెషన్‌లను నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ ధ్యానంపై అవగాహన ఉండాలి

తిరుత్తణి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పల్లిపట్టు సామంతవాడ గ్రామంలో బాలయోగీశ్వర మార్బుల్ పిరమిడ్ ధ్యాన మందిరంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పుత్తూరు ధ్యాన మందిర్ మాస్టర్ సుజాత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ధ్యానంతో మానవజీవన విధానంలో మార్పు వస్తుందని, పలు రకాల మానసిక రుగ్మతలు తొలగుతాయన్నారు. అనంతరం మాస్టర్ సుజాతను సామంతవాడ గ్రామ పిరమిడ్ ధ్యాన మందిరం నిర్వాహకులు సత్కరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా గవర్నర్ ఆర్‌ఎన్ రవి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

చెన్నై, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి వ్యవహరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... గవర్నర్ బాధ్యలు చేపట్టినప్పటి నుంచి ఆర్‌ఎన్ రవి రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాల్సిన గవర్నర్, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానించిన బిల్లులు సైతం ఆమోదించకపోవడం ఖండించదగ్గదన్నారు. సుప్రీంకోర్టు అక్షింతలతోనైనా గవర్నర్ తీరు మారలేదన్నారు. ఇటీవల మదురై త్యాగరాజర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రసంగించిన గవర్నర్, ప్రసంగం చివరిలో విద్యార్థులతో మూడు సార్లు 'జై శ్రీరామ్' అని పలికించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటున్న గవర్నర్... ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నారని, ఆయన్ను వెంటనే రీకాల్ చేయాలని షణ్ముగం డిమాండ్ చేశారు.

అన్నాడీఎంకే కూటమిలోనే కొనసాగుతాం

● ఎన్ఆర్ ధనపాలన్

అడయార్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్లుగా అన్నాడీఎంకే కూటమిలో తమ పార్టీ భాగస్వామ్య పార్టీగా ఉందని, ఇకపై కూడా కొనసాగుతామని పెరుంతలైవర్ కామరాజర్ కట్చి అధ్యక్షుడు ఎన్ఆర్ ధనపాలన్ స్పష్టం చేశారు. ఇదే విషయంపై ఆయన సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. అధికార డీఎంకేకు వ్యతిరేకంగా అన్నాడీఎంకే కూటమిలో చేరే ప్రతి పార్టీని తాము స్వాగతిస్తామన్నారు. బీజేపీ అధ్యక్షుడిగా నియమితులైన నయినార్ నాగేంద్రన్ చేసే ప్రతి పని విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎండీఎంకే నుంచి మల్లై సత్య బహిష్కరణ?

అడయార్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఎండీఎంకే ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న సీనియర్ నేత మల్లై సత్యను పార్టీ నుంచి బహిష్కరించనున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఆ పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి దురై వైగోతో మల్లై సత్యకు విభేదాలు తలెత్తాయి. దీంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించాలన్న డిమాండ్లు ఆ పార్టీ నేతల నుంచే వస్తున్నాయి. దీంతో పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో ఈనెల 20వ తేదీన పార్టీ ముఖ్య నిర్వాహకులతో సమావేశమై మల్లై సత్యను పార్టీ నుంచి బహిష్కరించే అంశంపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు.

తిరుత్తణి ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరుత్తణి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తమిళ నూతన సంవత్సరం సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేడుకల్లో భాగంగా ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, బంగారు కవచం, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కోట ఆర్ముస్వామి ఆలయంలో 1,008 మంది భక్తులు పాల కలశాలతో సుమారు 2 కి.మీ దూరం ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని, ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించారు.


పాలకలశాలతో ఆలయానికి వస్తున్న భక్తులు